క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 10న కౌడిపల్లి 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నందున కౌడిపల్లి, కొల్చారం, చిలిప్‌చెడ్ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్‌స్టేషన్ ఏడీఈ జయమ్మ, విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు, లైన్‌మెన్ శివకుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మేంటినెన్స్ వర్క్ నిర్వహించనుండటంతో 10న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని అన్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం



ఎల్లమ్మ కల్యాణోత్సవంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఒగ్గు కళాకారులు, సుధాకర్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు విశ్వేశ్వర్‌రావు, జింక శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రాలకు స్పందన



వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ శంకర్

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాలకు మంచి స్పందన వస్తుందని ఎంపీడీఓ శంకర్ చెప్పారు. మంగళవారం అల్లాదుర్గం మహిళా ఆరోగ్య కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తారని అన్నారు. మహిళలకు అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మెరుగైన వైద్యం అందిస్తారని తెలిపారు. ఈ కేంద్రాలకు ప్రతీ మంగళవారం వంద మంది వరకు మహిళలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్, డాక్టర్ అశ్విని, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంటలో కార్డన్ సెర్చ్



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంట గ్రామంలో కార్డన్ సెర్చ్‌ను సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు కల్వకుంట సరైన పత్రాలు లేకుండా ఉన్న 16 ద్విచక్రవాహనాలను సీజ్ చేశామని తెలిపారు. అనంతరం గ్రామంలో కళా బృందంతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత మొబైల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, ప్రకాష్‌గౌడ్, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముగిసిన నాగదేవత వార్షికోత్సవాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేట బస్వానంద ఆశ్రమంలోని సంతాన నాగదేవత, పోచమ్మ ఆలయాల ఐదవ వార్షికోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో వైరాగ్య శికామణి అవధూత మహారాజ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యను వెంటనే పరిష్కరించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. మంగళవారం మండలంలోని రామాయపల్లిలో ఏర్పాటు చేసిన వీఓఏల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వీఓఏల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మెదక్‌మున్సిపాలిటీ: ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి

మెదక్ మున్సిపాలిటీ: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మెదక్ పట్టణంలోని సిద్ధార్థ్ ఆదర్శ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ పరంపర కొనసాగించారు. మంగళవారం ఫలితాలు విడుదల కాగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సాయివర్షిత్ 462, ప్రణీష్ 455, బైపీసీ విభాగంలో బుష్రా అంజుమ్ 429, గౌసొద్దీన్ 428, అపరంజి 427, ఎంఈసీ విభాగంలో సిద్రా ఖనామ్ 480 సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో హర్షిత 987, బైపీసీ విభాగంలో 974 సీఈసీ విభాంలో 962 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ మచ్చేంద్రనాథ్, అధ్యాపకులు అభినందించారు.

రేగోడ్(మెదక్): ఇంటర్ ఫలితాల్లో రేగోడ్ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 76 శాతం విద్యార్థులు పాసయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాశ్ మంగళవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో జే. శ్రావణి 432, బైపీసీలో గొల్ల మల్లేశ్ 411, ఎఈసీలో మండ పూజిత 343/500 మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 70 శాతం విద్యార్థులు పాసయ్యారని చెప్పారు. ఇందులో బైపీసీలో జే.కిరణ్మయి 918, ఎంపీసీలో ఎం.శ్రావణి 915, సీఈసీలో దుర్గాప్రసాద్ 819 మార్కులు సాధించారు.

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులు 46 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంజేపీ తునికి, కౌడిపల్లి కళాశాలలకు చెందిన ఎంపీసీ విద్యార్థులు మోతిరామ్, రంజిత్‌గౌడ్ 979 మార్కులు సాధించారు. తునికి ఎంజేపీలో ప్రథమ సంవత్సరంలో 82మంది విద్యార్థులకు 78మంది 95శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 103మందికి 100మంది 97శాతం ఉత్తీర్ణత సాధించారు. కౌడిపల్లి ఎంజేపీలో ప్రథమ సంవత్సరం 41మందికి 36మంది ఉత్తీర్ణతతో 88శాతం, ద్వితీయ సంవత్సరంలో 37కు 35 మందితో 95శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో సాయికిరణ్ 456మార్కులు, మల్లేశ్ 453మార్కులు సాధించారు. కౌడిపల్లిలోని గిరిజన బాలుర గురుకుల కళాశాలలో 95శాతం ఉత్తీర్ణత సాధించారు.

కౌడిపల్లి జీజేసీలో...

కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 173మంది విద్యార్థులకు 75మంది 57శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 134మందికి 97మందితో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ విద్యార్థి శ్రావణి 918 మార్కులు సాధించారు.

అల్లాదుర్గంలో 96 శాతం ఉత్తీర్ణత

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్‌లో 96 శాతం, ఫస్టియర్‌లో 93 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు కళాశాల ఇన్‌చార్జ్ శ్యామ్‌రావు చెప్పారు. ఫస్టియర్ ఎంపీసీలో కుర్మ శ్రావణి 434 మార్కులు సాధించారు. సెకండియర్ బైపీసీలో ప్రసాద్ 891 మార్కులు, శ్రావణి 859 మార్కులు సాధించారు.

చేగుంట(తూప్రాన్): చేగుంట మోడల్ కళాశాలలోని ఇంటర్ ఎంపీసీలో 981 మార్కులు, లోకేంద్ర భండారీ, బైపీసీలో 980, రుసాలి కుమారీ, సీఈసీలో 924, మోహిత్ యాదవ్, ఎంపీసీలో అశోక్‌తివారీ, ప్రసాద్, కుమార్‌యాదవ్, ప్రవాళిక, బైపీసీలో జగదీశ్వర్, ఖలీదా, సాత్విక, షరీన్‌ఫతీమా, సీఈసీలో సాయితేజ, బాబు, సరిత, రేఖలు 9వందలకు పైగా మార్కులు సాధించారు. ప్రభుత్వ కళాశాలలో 70 శాతం ఒకేషనల్‌లో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ హరిప్రసిద్ నాయుడు తెలిపారు.

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మోడల్ కళాశాలలో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కారుణాకర్‌రెడ్డి తెలిపారు. సెకండ్ ఇయర్ బైపీసీలో 966 మార్కులు, సీఈసీలో మహేష్‌బాబు 950మార్కులు, ఎంపీసీలో దుర్గా భవాని 886మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో నరేష్ మార్కులకు 435మార్కులు, బైపీసీలో పావని 399 మార్కులు, సీఈసీలో మాధవి 367 మార్కులు సాధించారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 46%, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సయ్యద్ బేగం 986 మార్కులు సాధించింది.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మోడల్ కళాశాలలో విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు.

గురుకులంలో 94శాతం ఉత్తీర్ణత

నర్సాపూర్: పట్టణంలోని అల్లూరి సీతరామరాజు గిరిజన బాలుర గురుకుల కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 94శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారని ప్రిన్సిపాల్ భిక్షమయ్య చెప్పారు. తమ కాలేజీ నుంచి ద్వితీయ సంవత్సరంలో 66 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ పరీక్షలు రాయగా 62 మంది ఉత్తీర్ణులై 94శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని చెప్పారు. సీఈసీ విభాగంగా 44మంది పరీక్షలు రాయగా 33మంది ఉత్తీర్ణులైనారన్నారు. కాగా ప్రథమ సంవత్సరంలో 113 మంది పరీక్షలు రాయగా 72 మంది ఉత్తీర్ణులైనారని, ఎంపీసీలో ఆకాష్ వెయ్యికి 980 మార్కులు, బైపీసీలో విశాల్ వెయ్యికి 972మార్కులు సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో....

నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి 221 మంది ప్రథమ సంవత్సర పరీక్షలు రాయగా, 140 మంది ఉత్తీర్ణులైనారని కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. కాగా 122 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా 85మంది ఉత్తీర్ణులైనారని ఆయన వివరించారు.

తూప్రాన్‌లో..



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం బృందం

తూప్రాన్: ఇంటర్ ఫలితాల్లో తూప్రాన్ గీతా కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఆర్.శ్రీజ 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఎస్.మనోజ్ కుమార్ 429 మార్కులు సాధించారు. అలాగే సీఈసీ విభాగంలో యం.డి. సబూర తస్నీమ్ 489 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కె.నారాయణ గుప్తా, కృష్ణ, ప్రిన్సిపాల్ టి.రాజు, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

లారీలు రావడం లేదని రైతుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతులు

కొల్చారం(నర్సాపూర్): ధాన్యం ఆరబెట్టేందుకు తిప్పలు పడి, తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు సకాలంలో లారీలు రాకపోవడంతో ఆగ్రహానికి గురైన మండల కేంద్రానికి చెందిన రైతులు మంగళవారం మెదక్ – నర్సాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొల్చారంలో ప్రారంభించారు. రెండు రోజుల క్రితం తూకం వేసిన 1300 బస్తాల ధాన్యం తరలించేందుకు సాలకాలంలో లారీలు అందుబాటులోకి రాలేదు. అటువైపుగా వస్తున్న లారీలు వరిగుంతం వైపు మల్లుతుండడంతో అక్కడే లారీల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డుగా డ్రమ్ములను వేసి, రాస్తారోకోకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ రైతుల వద్దకు చేరుకొని సమస్యను పరిష్కరిస్తానంటూ నచ్చజెప్పి రైతులతో రాస్తారోకోను విరమింపజేశారు. ఫోన్ చేసి సంఘం చైర్మన్ మనోహర్‌ను రైతుల వద్దకు రప్పించారు. దీంతో రైతులు కొల్చారం కేంద్రానికి రావాల్సిన లారీలు వరిగుంతానికి వెళ్లడంపై చైర్మన్‌ను ప్రశ్నించారు. దీంతో స్పందించిన చైర్మన్ లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీనిచ్చారు.

బగలాముఖీ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న న్యాయమూర్తి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో మంగళవారం ఆలయ పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ కోర్టు న్యాయమూర్తి అనిత అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పాలొన్నారు.

యువతలో చైతన్యానికి కృషి



నియామక పత్రం అందుకుంటున్న దాడిగ నరేశ్

నర్సాపూర్: యువతలో చైతన్యం తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా మాల మహానాడు యువజన సంఘం అధ్యక్షుడు దాడిగ నరేశ్ అన్నారు. మండలంలోని ఇబ్రహీంబాద్‌కు చెందిన దాడిగ నరేష్‌ను రాష్ట్ర మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రమేశ్ జిల్లా మాల మహానాడు యువజన సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు మంగళవారం నాటికి 44 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు కుల సంఘాలు, వ్యాపార వర్గాలు, యువజన సంఘాల ప్రతినిధులు తమ మద్దతు ప్రకటించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం**

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన సత్తవ్వ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబానికి నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్ ఆదేశాలతో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు.

◆ **ఎమ్మెల్యేలు సీఎంపై ఒత్తిడి తీసుకురావాలి**

రామాయంపేట(మెదక్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం విషయమై ఎమ్మెల్యేలు సీఎంపై ఒత్తిడి తీసుకురావాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. 12 రోజులుగా వారు సమ్మె చేస్తున్నా.. వారి సమస్యల విషయమై ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోడంలేదని ఆరోపించారు.

◆ **కూలీ దినాలను సద్వినియోగం చేసుకోవాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి కూలీలు తమ కూలీ దినాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఓ శ్యాంకుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో ఉపాధి పనులు, కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధి కూలీలు ఎక్కువ మొత్తంలో పనులకు హాజరయ్యేలా ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూలీలు తదితరులు పాల్గొన్నారు.

◆ **రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

పెద్ద శంకరంపేట (మెదక్): వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్, మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలంలోని కొత్తపేట, జూకల్, బూర్గుపల్లి, గొట్టిముక్కుల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ వికాస్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, ఎంపీటీసీ వీణ సుభాష్ గౌడ్, సర్పంచ్ అనంతరావు, జగన్మోహన్‌రెడ్డి, సరిత, నాయకులు పరమేశ్వరరెడ్డి, సూర్యప్రకాష్, ఏపీఎం గోపాల్, సీసీలు లక్ష్మణ్, యోహాన్, నిరంజన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**



మెదక్ మున్సిపాలిటీ: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. చిన్నశంకరంపేట్ మండలం గవ్వలపల్లి గ్రామానికి చెందిన అఖిల, అతని భర్త భీక్యా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం చిన్నశంకరంపేట జెడ్పీటీసీ మాధవి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే రూ.2,00,000 ల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అఖిల కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడు రాజు, మిర్జాపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణానికి చెందిన బీమరి వెంకటేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతని ఆపరేషన్ ఖర్చుల కోసం మంత్రి హరీశ్‌రావు స్పందించి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఓసీని బాధితుడికి వైస్ చైర్మన్ అందజేశారు.

◆ **సీపీఆర్‌పై అవగాహన**

పెద్ద శంకరంపేట(మెదక్): ప్రజలు గుండెపోటుకు గురయ్యే సందర్భంలో సీపీఆర్‌ను ఎలా ఉపయోగించాలో వైద్యులు వికాస్ పోలీసులకు, ఫైర్ స్టేషన్ అధికారులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది, ఫైర్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు లేనిది పనులెలా చేస్తాం

స్వచ్ఛభారత్ మిషన్ సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు



సమావేశం బహిష్కరించిన సర్పంచ్‌లు

పాపన్నపేట(మెదక్): అభివృద్ధి పనులకు బిల్లులు రానిది పనులెలా చేస్తామంటూ మండల సర్పంచ్‌లు స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్–2 సమావేశంలో మండిపడ్డారు. స్వచ్ఛభారత్ మిషన్ సమావేశంపై గులాబీ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో మంగళవారం పాపన్నపేటలో జరిగిన స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్–2 సమావేశం మొక్కుబడిగా ముగిసింది. వివరాల్లోకి వెళ్తే.. జూనియర్ పంచాయతీ సెక్రటరీలు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలు సజావుగా జరగడానికి ఉపాధిహామీ సిబ్బందికి, సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అప్పుల పాలయ్యామని, మరి స్వచ్ఛభారత్ పనులు ఎలా చేయాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలకు చెందిన సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు. చాలా మంది సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కాలేదు. అయిన కొద్ది మంది సర్పంచ్‌లు సైతం సమావేశం ప్రారంభం కాగానే బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న గ్రామపంచాయతీ సర్పంచ్‌లు అప్పుల పాలై ఆస్తులు అమ్ముకుంటున్నట్లు చెప్పారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోతే, గ్రామ పాలన ఎలా నడుస్తుందని ప్రశ్నించారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ జగదీశ్వరా చారి అన్నారు. ఆయన ఉపాధిహామీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇంకుడు గుంతలు, మురుగు కాల్వల నిర్వాహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సమీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మహిపాల్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ సురేశ్, పీఆర్ ఏఈ గోపాల్, ఏపీఓ సంతోశ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ



కౌడిపల్లి(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి స్వప్న మంగళవారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద వరిధాన్యం తూకం వేయడం పరిశీలించారు.రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వర్షం పడుతున్నందున జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, సృజన, దివ్య, నిర్వాహకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వాహించాలని నిర్వాహకులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. మంగళవారం ఆమె చిలప్‌చెడ్ మండలంలోని శీలాంపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొలతల విషయంలో రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవన్నారు. కాగా శీలాంపల్లి ఇప్పటివరకు 3 లారీల ధాన్యం మిల్లర్లకు పంపించామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రేమలత, సీసీ నర్మద, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 11న సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరుద్యోగమార్చ్ వాల్‌పోస్టర్‌ని మంగళవారం మండల బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. నిరుద్యోగ మార్చ్‌కి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ చెప్పారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌తో నష్టపోయిన అభ్యర్థులకు లక్ష పరిహారం ఇవ్వడంతో పాటు లీకేజీలో విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్‌సాదుల, హరిగౌడ్, అనిల్, యాదగిరి తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ పోస్టర్ చేగుంటలో ఆవిష్కరణలో దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వైఖరికి నిరసనగా సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్ చేపట్టినట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో మండలాధ్యక్షుడు భూపాల్, కర్న పాండు, హరిశంకర్ సర్పంచ్ ఎల్లారెడ్డి, సాయిబాబా, సంతోష్‌రెడ్డి, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట (మెదక్): పేటలో నిర్వహించిన కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కోణం విఠల్ , నాయకులు శ్రావణ్ కుమార్, సంగమేశ్వర్, సురేష్, దమ్ము సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజీపేట రాజేందర్, మండలాధ్యక్షుడు రాకేష్, పార్టీ నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి’



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

నర్సాపూర్: రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొనడంతో పాటు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన 9 ఏళ్లలో నిరుద్యోగుల కోసం ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటుందని ఆయన ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 11న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి నిరుద్యోగ మార్చ్‌ను సంగారెడ్డిలో నిర్వహించతలపెట్టినట్లు క్యాసం వెంకటేశ్వర్లు వివరించారు. సమావేశంలో పార్టీ మహిళ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రఘువీరారెడ్డి, బాల్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’



వెల్దుర్తి(తూప్రాన్): కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్వరూప

కౌడిపల్లి(నర్సాపూర్): అంధత్వ నివారణకే ప్రభుత్వం గ్రామాలు, తండాల్లో కంటి వెలుగు వైద్యశిబిరం ఏర్పాటు చేస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాజునాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని తునికి గ్రామంలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, జెడ్పీటీసీ కవిత, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ మానిక్యరెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు అమర్‌సింగ్, వెంకటస్వామి, డాక్టర్ సృజన, ఆర్ఐ శ్రీహరి, వైద్యసిబ్బంది రామేశ్, లక్ష్మి, రేణుక, అంగన్‌వాడీ టీచర్ సుగుణ, తారాకేశ్వరీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

హస్తాల్‌పూర్‌లో..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో మంగళవారం రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ స్వరూప ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యబృందం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్నవారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డా.మౌనిక, మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు పాండురంగం, ఎంపీఓ విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో సర్పంచ్ స్వరూప ఆధ్వర్యంలో ఎంపీపీ స్వప్న కంటివెలుగు ప్రారంభించారు. ఇందులో కార్యదర్శి కమలాబాయి, నాయకులు ముఖ్తార్, బస్వరాజ్, ఈశ్వరప్ప, విక్రంగౌడ్, శంకర్, అవినాష్, శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, విఠల్, భూషణం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోనాయపల్లి(పీటీ)లో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో కంటి వెలుగు శిబిరాన్ని తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రభావతితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీ నర్సయ్య, నాయకులు పురం రవి, చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యులు ప్రియాంక, కార్యదర్శి విజయ్, ఉప సర్పంచ్‌లు ధర్మేందర్, నవీన్‌చారి, నాయకులు తదితరులున్నారు.